పోరు తెలంగాణ
పత్రిక ప్రకటనల కోసం
మరియు
చందాదారులుగా
చేరండి చేర్పించండి
వివరాలకు
సంప్రదించండి సెల్
8555918136

పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
పోరు తెలంగాణ
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న
పోరు తెలంగాణ తెలుగు పత్రికకు జిల్లా వారిగా స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గాల వారిగా ఆర్.సి. ఇంచార్జీలు
మండలాల వారిగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత, కొత్తవారికి అవకాశం ఉంటుంది.
R.N.I. No. TEL TEL/2014/57720
PORU TELANGANA Telugu Daily
పోరు తెలంగాణ
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9440019875, 8555918136

కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 గురువారం 20-08-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వేల : 04

# బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం కల్పించాం

- అమరవీరుల స్తూపానికి ప్రాధాన్యతే పాపన్న గౌడ్ విగ్రహానికి ఉండాలి
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం
- ట్యాంక్‌బండ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు
- బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించిన సీఎం



తెలంగాణ చరిత్రలోనే బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అర్హులైన నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రజాపాలనను కాపాడుకోవాలని, మళ్లీ పాత దొరల గద్దెనెక్కేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని మంత్రులు, గౌడ సంఘాల నేతల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గౌడ, యాదవ, ముదిరాజ్, దళిత వర్గాలను ప్రోత్సహించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఏ ఒక్క కులానికో, మతానికో పరిమితం కాలేదని, బహుజనులను ఏకతాటిపైకి తెచ్చి గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారని రేవంత్ రెడ్డి తెలిపారు. కులవృత్తులను గౌరవిస్తూనే పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ చదివించాలని తల్లిదండ్రులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కుటుంబ న్యాయం మాత్రమే - మిగతా 2 లో



## మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- భూ లక్ష్మి పథకం కింద పేదలకు ఎకరం చొప్పున ఇస్తామన్న కవిత
- రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలేనని విమర్శ
- రాష్ట్రంలో రేవంత్, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ సాగుతోందని ఆరోపణ

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే 'భూ లక్ష్మి పథకం' కింద భూమి - మిగతా 2 లో

# ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది



- మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపణ
- ఓటర్ల జాబితా నుంచి భారీగా ఓట్లు తొలగించారని ఆరోపణ
- సుమారు 73 లక్షల ఓట్లు తొలగించారన్న మహేశ్ కుమార్ గౌడ్
- బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని విమర్శ

# 5జీతో వేగం.. 6జీ పైనా భారత్ దృష్టి



- 2030 నాటికి భారత్‌లో 62 శాతానికి చేరనున్న 5జీ వినియోగం
- ఆసియా పసిఫిక్ సగటును అధిగమించనున్న ఇండియా
- కవరేజీ కంటే వినియోగం పెంచడమే అసలు సవాల్ అని వెల్లడి
- భారత్ డిజిటల్ ప్రగతిపై జీఎస్ఎంఏ నివేదికలో ప్రశంసలు

5జీ టెక్నాలజీ వినియోగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవనుందని, 2030 నాటికి దేశంలో 5జీ స్వీకరణ 62 శాతానికి చేరుకుంటుందని 'గ్లోబల్ మొబైల్ కమ్యూనికేషన్స్ సిస్టమ్'(జీఎస్ఎంఏ) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇది ఆసియా పసిఫిక్ ప్రాంత సగటు 50 శాతం కంటే గణనీయంగా ఎక్కువ కావడం విశేషం. ఈ ప్రాంతంలో బంగ్లాదేశ్, ఇండోనేషియా, పాకిస్థాన్‌లతో పాటు భారత్‌ను కూడా 'ప్రముఖ దేశం'గా జీఎస్ఎంఏ గుర్తించింది. ఒకప్పుడు నెట్‌వర్క్ కవరేజీ పెద్ద సవాల్‌గా ఉండగా, ఇప్పుడు దేశంలో ఆ సమస్య దాదాపు పరిష్కారమైందని - మిగతా 2 లో

# పసిబిడ్డతో అసెంబ్లీకి విజయ్ పార్టీ ఎమ్మెల్యే

- సోషల్ మీడియాలో చర్చ
- తమిళనాడు అసెంబ్లీకి పసిబిడ్డతో టీవీకే ఎమ్మెల్యే పల్లవి
- సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన.. కొందరు మద్దతు, కొందరు విమర్శ
- బిడ్డను ఇంట్లో వదిలిరాలేనని స్పష్టం చేసిన ఎమ్మెల్యే
- ఇబ్బందులు తెలియకుండా ట్రోల్ చేయడం సరికాదన్న పల్లవి



తమిళనాడు అసెంబ్లీ సమావేశాలకు ఓ మహిళా ఎమ్మెల్యే తన పసిబిడ్డతో హాజరవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఆర్. పల్లవి, కొన్ని - మిగతా 2 లో

## అర్జున అవార్డు గ్రహీతలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు



- అర్జున అవార్డులకు ఎంపికైన తెలంగాణ క్రీడాకారులకు ముఖ్యమంత్రి అభినందనలు
- షట్లర్ గాయత్రి, షూటర్ ధనుష్‌లను ప్రశంసించిన రేవంత్ రెడ్డి
- వీరిద్దరూ తెలంగాణకు, దేశానికి గర్వకారణమని వ్యాఖ్య

## వెలుగులోకి అరుదైన జీవి



- 'గంగైఇక్తిస్ ఇండోనేపాలికస్'గా నామకరణం
- భారత్-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో ఓ బోరుబావి నుంచి బయటపడ్డ జీవి
- గంగానది పేరుతో దీనికి 'గంగైఇక్తిస్' అనే పేరు
- 'చౌధురిడే' కుటుంబానికి చెందిన కొత్త జాతిగా గుర్తింపు

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఓ వీడియో శాస్త్రవేత్తలను ఓ అరుదైన చేప జాతి ఆచూకీ - మిగతా 2 లో

## 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ చానల్ డాక్యుమెంటరీ

- ఉలిక్కిపడిన పాకిస్థాన్!
- 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ డాక్యుమెంటరీతో కలకలం
- భారత్ వాదనలను తప్పుబడుతూ పాక్ సైన్యం అధికారిక ప్రకటన
- ఉగ్రసంస్థలకు భారీ నష్టం జరగడంతో పాక్ ఎదురుదాడి



భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ ఛానెల్ రూపొందించిన డాక్యుమెంటరీ ప్రస్తుతం పాకిస్థాన్‌లో తీవ్ర ప్రకంపనలు - మిగతా 2 లో



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమ

- అభ్యర్థుల ఎంపికకు ఆమోదం తెలిపిన ఏపీ కేబినెట్
- ఆమోదం కోసం గవర్నర్ వద్దకు చేరిన దస్త్రం
- సీనియారిటీకి, పార్టీ సేవకు గుర్తింపునిచ్చిన టీడీపీ అధిష్ఠానం
- గత ఎమ్మెల్సీల పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఖాళీలు

ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థులను ఖరారు చేసింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత వర్ల రామయ్య, అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళా నేత దళవాయి రమాదేవిలను శాసనమండలికి నామినేట్ చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. - మిగతా 2 లో

## స్థానిక ఎన్నికల్లో కూటమితో కలిసి బరిలోకి దిగుతాం



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- స్థానిక ఎన్నికల కోసం మంత్రి సత్యకుమార్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్న మాధవ్
- ప్రతి గ్రామంలో కమలం జెండా ఎగిరేలా ముందుకు వెళ్లాలని శ్రేణులకు పిలుపు
- విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకున్నామని వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి భాగస్వాములతో కలిసే బరిలోకి దిగుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల కీలక - మిగతా 2 లో

# అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు

- బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలే ప్రధాన అజెండాగా భేటీ
- పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలపై చర్చ



స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.1 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.16,500 కోట్ల నిధులు మురిగిపోకుండా అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఏపీ పంచాయతీరాజ్ చట్టం-1994 నిబంధనల ప్రకారం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. న్యాయపరమైన అంశాల్లో ఉన్న 23 మునిసిపాలిటీల విలీనాన్ని తర్వాత పరిశీలిద్దామని, ముందుగా అన్ని స్థానిక సంస్థల్లో ఎన్నికలు నిర్వహిద్దామని స్పష్టం చేశారు. మేయర్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, పాత విధానంలో ఒక్క డిప్యూటీ మేయర్ పదవికే పరిమితం - మిగతా 2 లో

# సంపాదకీయం

## అర్థమవుతోందా ట్రంప్.. ఒడిస్సీ సందేశం!



ఎప్పుడూ కయ్యానికి కాలుదువ్వే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల ఓ చల్లటి కబురు చెప్పారు. ఇరాన్‌తో యుద్ధం త్వరలో ముగిసిపోతుందన్నదే ఆ చక్కటి మాట! అంతర్జాతీయ సమాజం కోరుకుంటున్నదే అది కదా! ఆ యుద్ధ పరిసమాప్తినే సమస్త దేశాలూ ఆకాంక్షిస్తున్నాయి. ప్రపంచ ప్రజలూ అందుకోసమే ప్రతీక్షిస్తున్నారు. కళారూపాలు ఆ ఆరాటాన్నే వ్యక్తం చేస్తున్నాయి, ప్రతిబింబిస్తున్నాయి. ఇదిగో, ఈ మధ్యే విడుదలై ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోన్న హాలీవుడ్ చిత్రం 'ఒడిస్సీ' కూడా మానవాళి అభిమతాన్ని చెప్పకనే చెప్పింది: యుద్ధం వద్దు, శాంతి ముఖ్యం. ఇంతకుముందు 'ఇంటర్ స్టెల్లార్', 'ఓపెన్ హైమర్' వంటి సినిమాలతో చలనచిత్ర జగత్తులో తనకంటూ ఒక విశిష్ట స్థానాన్ని సృష్టించుకున్న క్రిస్టోఫర్ నోలన్ ఈ 'ఒడిస్సీ' దర్శకుడు. మౌఖిక సంప్రదాయంలో ప్రజల నోళ్లలో నానుతున్న ఒక గ్రీక్ పుక్కిటపురాణాన్ని తన 'ఒడిస్సీ'కి కథగా నోలన్ ఎంచుకున్నాడు. అసలు నిజంగా ఉన్నాడో లేడో తెలియని ప్రాచీన గ్రీక్ వాగ్గేయకారుడు హోమర్ మూడువేల సంవత్సరాల క్రితం రాసినట్టు చెబుతున్న 'ఒడిస్సీ' అనే కావ్యం ఈ నాటి అత్యాధునిక డిజిటల్ ప్రపంచంలో ఐమాక్స్ ఫార్మాట్‌లో చలనచిత్రంగా ప్రపంచవ్యాప్తంగా సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇదొక కళాత్మక విచిత్రం. సౌందర్యాత్మక విచిత్రమది. నోలన్ 'ఒడిస్సీ'లో ఉగ్రరూతలూగించే దృశ్యాలు లేవు. భయంకరమైన యుద్ధాలు లేవు. సినిమా విజయానికి సాధారణంగా కావలసిన పటాటోపం కూడా ఏమీ లేదు! అయినప్పటికీ, లేదా అందువల్లే ఈ 'ఒడిస్సీ'కి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఇందుకు ఒక కారణం అంతకుముందు తెలిసినా తెలియకపోయినా స్వభావరీత్యా కథ సార్వజనీనం కావడమే. ఆ కథ ప్రతి దేశ చరిత్రతోనూ ఎంతో కొంత ప్రాసంగికత కలిగి ఉండడం మరో కారణం. మరీ ముఖ్యంగా ఈ చిత్ర కథనంతో ప్రేక్షకులు ఏదో ఒక దశలో తమను తాము గుర్తించగలగడం! జీవితంలో చాలా సాధించేశాం అనుకున్న తర్వాత ఇంకా ఏముంది సాధించడానికి అన్న మీమాంస మొదలవుతుంది, లేదా జీవన పోరాటంలో మన చుట్టూ ఉన్న మనవాళ్లు చివరివరకూ ఉంటారని ఆశిస్తే వారంతా పరిస్థితుల ప్రాబల్యం వల్ల ఆకస్మికంగా మనకు దూరం కావచ్చు. విజయ తీరాలు దాటేసిన తర్వాత ఒంటరిగా మిగిలిపోవచ్చు, ఎటుపోవడానికీ పాలుపోని సమయంలో అనూహ్యంగా ఎవరో వచ్చి కాసింత బాసటగా నిలవచ్చు. జీవితంలో ఏదో సాధించడానికి ఎక్కడెక్కడికో ఒంటరి ప్రయాణం చేస్తుంటే ఇంటివాళ్ల పరిస్థితి జ్ఞప్తికి వచ్చి మానసికంగా అశాంతికి గురి కావచ్చు; తీరా ఇంటికి వచ్చాక మనవాళ్లకు మనమే సుదూరతీరాల నుంచి వచ్చిన అపరిచితుల్లా కనిపించవచ్చు... ఈ దశలన్నిటినీ 'ఒడిస్సీ' చిత్రంలోని కథానాయకుడు ఒడిస్సియస్ అనుభవిస్తాడు. ఇటువంటి అనుభవాలు ఆధునిక జీవితంలో సైతం మనకూ ఎదురుకావచ్చు. అటువంటి స్థితిలోనే ప్రేక్షకులు ఒడిస్సియస్‌లో తమను తాము చూసుకుంటారు. ఆ పాత్రతో తాదాత్మ్యం చెందుతారు.

# వెలుగులోకి అరుదైన జీవి



**మొదటిపేజీ తరువాయి -** వైపు నడిపించింది. సాధారణంగా చేపలకు ఉండే లక్షణాలకు పూర్తిగా భిన్నంగా, అచ్చం వానపాములా కనిపించిన ఓ చిన్న జీవి భారత్-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో ఓ బోరుబావి నుంచి బయటకు వచ్చింది. 2024లో సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడంతో శాస్త్రవేత్తల దృష్టి దానిపై పడింది. పూర్తిగా చీకటిగా ఉండే భూగర్భ జలాల్లో ఈ జీవి బయటపడటంతో ఇది ఇంతవరకు గుర్తించని కొత్త జాతి కావచ్చని పరిశోధకులు అనుమానించారు. ఈ వింత చేపకు శాస్త్రవేత్తలు 'గంగైఇక్తిస్ ఇండోనేపాలికస్' అనే పేరు పెట్టారు. గంగానది పేరుతో దీనికి 'గంగైఇక్తిస్' అనే పేరు పెట్టినట్లు పరిశోధకులు తెలిపారు. దాదాపు నాలుగు సెంటీమీటర్ల పొడవు ఉండే ఈ చేపకు కళ్లు చాలా చిన్నగా ఉంటాయి. భూగర్భంలో ఎలాంటి వెలుతురు లేకపోవడంతో చూపు అవసరం లేకపోవడమే ఇందుకు కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ చేపకు పెద్ద రెక్కలు లేవు. నీటితో నిండిన మట్టి పొరలు, భూగర్భంలోని తడి ప్రాంతాల్లో వానపాములా శరీరాన్ని మెలితిప్పుకుంటూ కదులుతుంది. బయటకు చూస్తే వానపాములా కనిపించినప్పటికీ, మైక్రో-సీటీ స్కానింగ్, జన్యు విశ్లేషణల ద్వారా ఇది పూర్తిగా భిన్నమైన చేప జాతి అని పరిశోధకులు నిర్ధారించారు. ఇది 'చౌధురిదే' కుటుంబానికి చెందిన కొత్త జాతిగా గుర్తించారు. ఈ అరుదైన చేపను పట్టుకోవడం మాత్రం పరిశోధకులు చాలా శ్రమించారు. బోరుబావులను గుర్తించి వాటి యజమానుల అనుమతి తీసుకొని పరిశోధకులు నీటిని చేతులతో బయటకు తోడారు. సుమారు 2,000 లీటర్ల నీటిని బయటకు తీసిన తర్వాత మొదటి చేప కనిపించింది. అయితే అది గాయపడి వెంటనే చనిపోయింది. మరో 500 లీటర్ల నీటిని తోడిన తర్వాత రెండో చేప లభించింది. అదే పూర్తి స్థితిలో లభించిన నమూనా కావడంతో దానిని ఈ కొత్త జాతికి 'హోలోటైప్'గా శాస్త్రవేత్తలు గుర్తించారు. ముంబైకి చెందిన థాక్రే వైల్డ్‌లైఫ్ ఫౌండేషన్, కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన షాంఘై సింక్రోట్రాన్ రేడియేషన్ ఫెసిలిటీ, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన పరిశోధకులు కలిసి ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ పరిశోధన వివరాలు 'జూకీస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇండో-గంగా మైదానాల్లో, గంగానది పరివాహక ప్రాంతంలో గుర్తించిన తొలి భూగర్భ జల చేపగా దీన్ని పరిశోధకులు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో సాధారణంగా కనిపించిన ఓ వీడియో చివరకు శాస్త్రవేత్తలను భూమి లోపల దాగి ఉన్న అరుదైన జీవ వైవిధ్యాన్ని కనుగొనేలా చేసింది. కోట్లాది మంది జీవనానికి నీరు, ఆహారం, ఉపాధిని అందించే గంగానది పరివాహక ప్రాంతంలో ఇలాంటి వింత జీవి బయటపడటం శాస్త్రవేత్తలకు ఆసక్తికరమైన పరిణామంగా మారింది. సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ ఆవిష్కరణ ఇప్పుడు ప్రపంచ శాస్త్రీయ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది.

# 5జీతో వేగం.. 6జీ పైనా భారత్ దృష్టి

**మొదటిపేజీ తరువాయి -** నివేదిక పేర్కొంది. ప్రస్తుతం కవరేజీ గ్యాప్ 5 శాతానికి పడిపోవడంతో అసలు సవాల్ కవరేజీ నుంచి వినియోగం, స్వీకరణ వైపు మారిందని తెలిపింది. స్మార్ట్‌ఫోన్ల ధరలు, డిజిటల్ నైపుణ్యాల కొరత, ఆన్‌లైన్ భద్రతపై నమ్మకం వంటివి మొబైల్ ఇంటర్నెట్ వాడకానికి ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని వివరించింది. ఈ సవాళ్లను అధిగమించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను నివేదిక ప్రశంసించింది. 'భారత్‌నెట్', 'ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ (పీఎంజీదిశ)' వంటి పథకాలను ఉదాహరణగా పేర్కొంది. పీఎంజీదిశ ద్వారా ఇప్పటికే 6.4 కోట్ల మంది గ్రామీణ పౌరులకు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చినట్లు గుర్తు చేసింది. అదే సమయంలో డిజిటల్ నమ్మకాన్ని పెంపొందించడం కూడా భారత్‌కు ఆర్థిక ప్రాధాన్యతగా మారుతోందని, 2026 నాటికి ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీపై చేసే ఖర్చు 11.7 శాతం పెరుగుతుందని అంచనా వేసింది. ఇందుకు దేశంలో అమలవుతున్న డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం దోహదపడుతోందని తెలిపింది. టెక్నాలజీలో స్వావలంబనపై భారత్ దృష్టి సారించిందని, 'ఆత్మనిర్భర్ భారత్' విధానం ఇందుకు నిదర్శనమని నివేదిక పేర్కొంది. బీఎస్ఎన్ఎల్ దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ టెక్నాలజీని వాడటం, దానిని 5జీకి అప్‌గ్రేడ్ చేసుకునే వీలుండటం గొప్ప విషయమని తెలిపింది. అంతేకాకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారత్ ఇప్పటికే 6జీ స్పెక్ట్రమ్ రోడ్‌మ్యాప్‌ను కూడా ప్రకటించడం దాని దీర్ఘకాలిక ప్రణాళికకు అద్దం పడుతోందని వివరించింది. 5జీ, కృత్రిమ మేధ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటివి తయారీ, సేవల రంగాల్లో ఉత్పాదకతను గణనీయంగా పెంచుతాయని నివేదిక అంచనా వేసింది.

## 'ఆపరేషన్ సిందూర్'పై డిస్కవరీ చానల్ డాక్యుమెంటరీ

**మొదటిపేజీ తరువాయి -** సృష్టిస్తోంది. ఆగస్టు 15న ప్రసారమైన "డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్" అనే ఈ డాక్యుమెంటరీతో ఉలిక్కిపడిన పాకిస్థాన్, ఈ డాక్యుమెంటరీపై, భారత్‌పై ఎదురుదాడికి దిగింది. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత సాయుధ దళాలు అత్యంత రహస్యంగా నిర్వహించిన ఈ ఆపరేషన్ వివరాలను ఈ డాక్యుమెంటరీ కళ్లకు కట్టింది. పాకిస్థాన్ సైన్యానికి చెందిన మీడియా విభాగం 'ఇంటర్-సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్' (ఐఎస్‌పీఆర్) ఈ డాక్యుమెంటరీపై స్పందిస్తూ, ఇది భారత్ సృష్టించిన కల్పిత కథనమని ఆరోపించింది. ఈ ఆపరేషన్ వంద శాతం విజయవంతమైందన్న భారత వాదనలను అది తోసిపుచ్చింది. అయితే, ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ సైన్యం తీవ్రంగా నష్టపోయిందని, ఆ పరాభవాన్ని కప్పిపుచ్చుకోవడానికే పాక్ ఉన్నతాధికారులు ఇటువంటి దూకుడు ప్రదర్శిస్తున్నారని భారత అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ ఆపరేషన్ ధాటికి లష్కరే తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి ఉగ్రవాద సంస్థలు తమ శిక్షణా కేంద్రాలు, ప్రధాన కార్యాలయాలతో పాటు కీలక మౌలిక వసతులను, కేడర్‌ను భారీగా కోల్పోయాయి. తాజాగా విడుదలైన ఈ డాక్యుమెంటరీ పాకిస్థాన్ పాత గాయాలపై కారం చల్లినట్లయిందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో, డాక్యుమెంటరీ ప్రామాణికతను ప్రశ్నిస్తూ సోషల్ మీడియా వేదికగా నిరంతర ప్రచార దాడులు నిర్వహించాలని ఐఎస్‌పీఆర్‌కు ఆదేశాలు అందినట్లు భారత నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ జరిగినప్పటి నుంచి భారత్‌పై పాకిస్థాన్ ఒక 'సమాచార యుద్ధాన్ని కొనసాగిస్తోందని, అందులో భాగంగానే సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా తప్పుడు కథనాలు, మార్ఫింగ్ వీడియోలను ప్రచారం చేసే ప్రమాదముందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

# బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం కల్పించాం

**మొదటిపేజీ తరువాయి -** జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక న్యాయం చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నేత, గీత కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని సీఎం తెలిపారు. బీసీల జనాభా లెక్కలు తేల్చి సామాజిక న్యాయం అందించిన తొలి ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న కేటీఆర్, హరీశ్‌రావు ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో కరవు రావాలని కోరుకుంటూ అఘోరాలతో చేతబడులు చేయించారని ఆరోపించారు. పాత దొరల పాలన మళ్లీ రావడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని ప్రజలను కోరారు. గత బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నాడు గొర్రెలు, బర్రెలు, చేపలు పంపిణీ చేసి.. రాజ్యం వాళ్లు ఏలుతూ, మనల్ని కుల వృత్తులకే పరిమితం చేయాలని చూశారు' అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కొడుకు కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్, అల్లుడు హరీశ్ రావు మంత్రి అయ్యారని.. అదే రేవంత్ సీఎం అయితే బీసీ నేత మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్, సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలికి కీలక పదవులు ఇచ్చి ఉద్యమకారులను గౌరవించామని తెలిపారు. రాబోయే డీలిమిటేషన్ తర్వాత 117 సీట్లతో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ఈసీ లక్షలాది ఓట్లను తొలగించింది




**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం (ఈసీ) విచక్షణారహితంగా లక్షలాది ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ముసాయిదా ఓటరు జాబితా విడుదలైన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించలేదని, ఈ ఓట్ల తొలగింపు ప్రక్రియ వల్ల పేదలు, వలస కార్మికులే ఎక్కువగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకోవడం ఆచరణ సాధ్యం కాదని, పాత రికార్డులను సాకుగా చూపుతూ పౌరుల ఓటు హక్కును నిరాకరించడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎలాంటి పక్కా కారణాలు లేకుండా సుమారు 73 లక్షల ఓట్లను తొలగించారని, మరో 92 లక్షల ఓట్లను అనుమానిత జాబితాలో చేర్చారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల మార్పుల వల్ల తలెత్తిన సాంకేతిక సమస్యలు ఈ గందరగోళానికి కారణమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీల తరహాలోనే ఎన్నికల సంఘాన్ని కూడా తన 'పాకెట్ సంస్థ'గా మార్చుకుందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

# అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు

**మొదటిపేజీ తరువాయి -** కావాలని నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లే కొనసాగుతాయని స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు కేబినెట్‌కు వివరించారు. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీలను జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. మొత్తం 57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉద్యోగాల కల్పన, పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలపై నిర్ణయాలు తీసుకున్నారు. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ విద్యార్థులకు కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లు, ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ బిల్లుపై చర్చించింది. మంత్రివర్గ అజెండా అంశాలపై చర్చ పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ పరిణామాలపై మంత్రులు, అధికారులతో చర్చించారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివ్ కామెంట్లపై ధీటుగా స్పందించాలని సూచించారు. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టకుండా కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా కంటైనర్లలో ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీలతో కలిసి బరిలోకి దిగుతాం

**మొదటిపేజీ తరువాయి -** సమావేశంలో మాట్లాడిన ఆయన, స్థానిక ఎన్నికల సమన్వయ బాధ్యతలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నేతృత్వంలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూనే వార్డు స్థాయి నుంచి ప్రతి గ్రామంలోనూ కమలం జెండా ఎగిరేలా, స్థానిక పదవులను దక్కించుకునేలా ప్రణాళికలతో ముందుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి ఫలాలను, మన్ కీ బాత్ వేదికగా వ్యక్తమయ్యే సందేశాలను ప్రతి ఇంటా ప్రచారం చేయాలని సూచించారు. అలాగే విశాఖ అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ... దక్షిణ కోస్తా రైల్వే జోన్ సాధనతో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకున్నామని, ప్రస్తుతం అది లాభాల దిశగా ప్రయాణిస్తోందని పేర్కొన్నారు. పోలవరం నీటిని విశాఖ ప్రాంతానికి అందించే పనులు కూడా వేగవంతమయ్యాయని వివరించారు.

# పసిబిడ్డతో అసెంబ్లీకి విజయ్ పార్టీ ఎమ్మెల్యే

**మొదటిపేజీ తరువాయి -** నెలల వయసున్న తన బిడ్డను ఎత్తుకుని సభా కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఈ ఉదంతంపై సామాజిక మాధ్యమాల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో పల్లవి తన బిడ్డను సహాయకురాలి పర్యవేక్షణలో ఉంచి, విరామ సమయాల్లో పసికందు బాగోగులు చూసుకుంటున్నారు. అయితే, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు పసిబిడ్డను తీసుకువచ్చి అసౌకర్యం కలిగిస్తున్నారంటూ కొందరు ఆమెపై విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు, ఒక తల్లిగా పసిబిడ్డను సంరక్షించుకుంటూనే, ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారంటూ పలువురు ఆమెకు మద్దతు తెలుపుతున్నారు. ఈ విమర్శలపై ఎమ్మెల్యే పల్లవి స్పందించారు. "బిడ్డకు కొన్ని నెలలే వయసే కావడంతో ఇంట్లో వదిలి రావడం సాధ్యం కాదు. ఒక తల్లిగా నా బాధ్యతలను, ఎమ్మెల్యేగా నా విధులను ఏకకాలంలో నిర్వర్తించడంలో ఎలాంటి తప్పు లేదు. నేను కేవలం నా కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాను తప్ప, ఎవరికీ ఇబ్బంది కలిగించాలనే ఉద్దేశం నాకు లేదు. వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోకుండా సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేయడం సరికాదు" అని ఆమె స్పష్టం చేశారు.

## అర్జున అవార్డు గ్రహీతలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు



**మొదటిపేజీ తరువాయి -** ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డులకు ఎంపికైన తెలంగాణ క్రీడాకారులు, షట్లర్ పుల్లెల గాయత్రి గోపీచంద్, షూటర్ ధనుష్ శ్రీకాంత్‌లకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. క్రీడా రంగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన వీరిద్దరూ తెలంగాణతో పాటు దేశానికే గర్వకారణమని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. "క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభతో అర్జున అవార్డులకు ఎంపికైన గాయత్రి, ధనుష్ తెలంగాణకు గర్వకారణం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వీరితో పాటు 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలు గెలుచుకున్న విజేతలందరికీ ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడా రంగంలో వారు చూపిన పట్టుదల, నిబద్ధత, కఠోర శ్రమ యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించి, మరెన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల రామయ్య, దళవాయి రమ



**మొదటిపేజీ తరువాయి -** ఈ మేరకు సిఫార్సులతో కూడిన దస్త్రాన్ని ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న పందుల రవీంద్రబాబు, జాకియా ఖానమ్‌ల పదవీకాలం ముగియడంతో ఈ రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో అధికార టీడీపీ, పార్టీకి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ఇద్దరు నేతలకు అవకాశం కల్పించింది. దళిత వర్గానికి చెందిన వర్ల రామయ్య పార్టీలో కీలక నేతగా, గతంలో ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2009లో తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు. మరోవైపు, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవి బీసీ (వడ్డెర) సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు. రెండు దశాబ్దాలుగా ఆమె పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంట్ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె కుటుంబం మొదటి నుంచి టీడీపీకి అండగా నిలుస్తోంది. 2021లో అనంతపురం కార్పొరేటర్‌గా పోటీ చేసిన రమాదేవి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేషంగా కృషి చేశారు. సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా నేతకు పదవులు ఇవ్వడం ద్వారా టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన సందేశం పంపినట్టయింది. ప్రస్తుతం ఈ ఫైల్ గవర్నర్ పరిశీలనలో ఉండగా, ఆయన ఆమోదముద్ర వేయగానే వీరి నియామకం అధికారికంగా ఖరారు కానుంది.

# మేము అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం భూమి ఇస్తాం




**మొదటిపేజీ తరువాయి -** లేని పేదలకు ఎకరం చొప్పున ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భూమి అంటే కేవలం వ్యాపార లావాదేవీలే కావచ్చు కానీ, పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి అంటే పంచప్రాణాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా పేదల అసైన్డ్ భూములనే లాక్కుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సోదరులు, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల దోపిడీ, రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కుందని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినట్లుగా పేదల అసైన్డ్ భూములపై వారికే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి 'మేకవన్నె పులి' లాంటి వారని... ఆయన చెప్పేది సామాజిక న్యాయం అయితే, చేసేది ఆటవిక న్యాయమని విమర్శించారు. కేబినెట్ తో పాటు ప్రభుత్వ సలహాదారులు, ఆర్టీఐ కమిషనర్ల నియామకాల వరకు బడుగు, బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయం నడుస్తోందని మండిపడ్డారు.

# మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి: హరీశ్ రావు

**రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని మండిపాటు**

**పెద్ద తప్పు చేసి క్షమాపణల చెబితే ప్రజల బాధలు తీరవని వ్యాఖ్య**

**కల్యాణలక్ష్మి పథకాన్ని సంతానలక్ష్మి పథకంగా మార్చేశారని మండిపాటు**



సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చిక్కులు సృష్టిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో జరిగిన పెద్ద తప్పిదానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించకపోతే... ముఖ్యమంత్రి, మంత్రులు కలిసే ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు క్షమాపణలు చెబితే ప్రజల బాధలు తీరవని, అసలు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చమని ఆదేశించింది ఎవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదని, వారు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు. భూములను నిషేధిత జాబితాలో పెట్టింది ప్రభుత్వమే కాబట్టి, ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకోకుండా వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్సీని రద్దు చేయడంతో ఆ స్థలాలు పట్టా భూములుగా మారాయని... అలాగే జీఓల ద్వారా మినహాయింపు పొందిన హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా ఇప్పుడు 22ఏ లో చేర్చి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కల్యాణలక్ష్మి పథకం 'సంతానలక్ష్మి'గా మారిపోయిందని, పెళ్లి సమయానికి అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత గానీ రావడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పు చేసిన కాంగ్రెస్ నేతలను చట్టపరంగా బాధ్యులను చేస్తామని హెచ్చరిస్తూ, 22ఏ భూముల అంశంపై కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీ వేదికగా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

# పడగల్ గ్రామంలో కళ్యాణ లక్ష్మీ చెక్కుల అందజేత



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** వేల్పూరు మండలంలోని పడగల్ గ్రామంలో సర్పంచ్ నల్ల రాజు ఆధ్వర్యంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.లబ్ది దారులు మందొడ్ రాజమణి,దాసరి కళ, సాదుల్లా ముత్తెమ్మ, మగ్గిడి మమత,ఎం డి షమీనా లకు 100116 విలువ గల చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా లబ్ది దారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ నరేందర్,జిపివో గంగాధర్,వార్డు సభ్యులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేంపల్లి గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణం కోసం భూమి పూజ




**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో జలసిరి లో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. వర్షపు నీటిని పొదుపు చేసి, వ్యవసాయ రంగంలో నీటి సదుపాయం కొరకు ఈ నిర్మాణాలు చాలా అవసరమని సర్పంచ్ మహేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి లత, వార్డు సభ్యులు,ఎఫ్ ఎ జగదీష్,ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతి బాపూలే బాల్కొండ వసతి గృహం ఆకస్మిక తనిఖీ



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే రెసిడెన్షియల్ బాలుర/బాలికల పాఠశాల మరియు వసతి గృహాన్ని మండల పరిషత్ అధికారి ఆర్.గంగామోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ పర్యటనలో భాగంగా ఆయన వసతి గృహంలో పరిసరాలు,వంటగది,డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థులకు నిబంధనల ప్రకారం మెనూ ప్రకారం పౌష్టికాహారం, నాణ్యమైన భోజనం అందించాలని,తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరిసరాలను నిరంతరం శుభ్రంగా ఉంచుకోవాలని,విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.అలాగే తరగతి గదులను సందర్శించి,విద్యాబోధన తీరుపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, పంచాయతీ కార్యదర్శి మోహన్ మరియు హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాగపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలంలోని నాగపూర్ గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, మాజీ డిసిసి అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి పథకం పేదల పాలిట వరం అని తెలిపారు.పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బాల్కొండ మండల అధ్యక్షుడు ప్రవీణ్,మాజీ మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్,వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సారెడ్డి, గంగ ప్రసాద్, ప్రవీణ్ గౌడ్, కిషన్ గౌడ్, గంగ మల్లు, రాజు,నాగపూర్ గ్రామ అధ్యక్షులు నరేష్,కృష్ణ, చిన్న నారాయణ, మహేందర్, భూమేష్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పాలీటెక్నిక్ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించి,జీవో నంబర్ 97ను రద్దు చేయాలని ఏబీవీపీ డిమాండ్





**పోరు తెలంగాణ ప్రతినిధి // మెట్ పల్లి :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏబీవీపీ కోరుట్ల శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాలీటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ జగిత్యాల జిల్లా కన్వీనర్ మడవేణి సునీల్ మాట్లాడుతూ...ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 97 విద్యార్థుల భవిష్యత్తుకు తీవ్ర విఘాతం కలిగిస్తోందని,తక్షణమే రద్దు చేయాలన్నారు.అలాగే శక్తి కాలేజీని పాలీటెక్నిక్ కళాశాలతో కలిపే ప్రతిపాదనను ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.స్వార్థ ప్రయోజనాల కోసం పాలీటెక్నిక్ కళాశాల స్వయంప్రతిపత్తిని, వసతులను దెబ్బతీసేలా తీసుకుంటున్న చర్యలను సహించేది లేదని హెచ్చరించారు.విద్యార్థుల హక్కులను కాలరాసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోకపోతే, రాబోయే రోజుల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

## పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, SIR ప్రక్రియపై విస్తృత చర్చ




**కొత్తగూడెం ఆగస్టు 19: పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** ఉమ్మడిఖమ్మంలోని సంజీవరెడ్డి భవన్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఏఐసీసీ సభ్యులు సచిన్ సావంత్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి తోట దేవీ ప్రసన్న, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం వంటి అంశాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. అలాగే సర్ ప్రక్రియపై పార్టీ శ్రేణులను అప్రమత్తం చేయాలని నిర్ణయించారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, ఓటర్ల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం అయ్యేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**సచిన్ సావంత్‌కు పాయం ఘన సత్కారం**

ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సచిన్ సావంత్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

# జైపూర్ రైతు వేదికలో మండల స్థాయి సమీక్షా సమావేశం





**పోరు తెలంగాణ, మంచిర్యాల జిల్లా, ఆగష్టు 19 :** జైపూర్ మండల కేంద్రం లోని రైతు వేదిక వద్ద మండల స్థాయి సమీక్షా సమావేశం లో జైపూర్ మండల స్పెషల్ అధికారి ఆర్డిఓ శ్రీనివాస్ రావు, ఎంపీడీఓ శ్రీపతి బాపు రావు, తహసీల్దార్ వనజా రెడ్డి పాల్గొన్నారు ,ఈ మండల స్థాయి సమీక్షా సమావేశం, మండల అభివృద్ధికి ఒక నూతన దిశానిర్దేశం చేసింది అని,ఈ సమావేశం కేవలం ఒక ఆచారబద్ధమైన ప్రక్రియ కాకుండా, మండలంలోని ప్రతి ప్రభుత్వ శాఖ యొక్క పనితీరును లోతుగా విశ్లేషించి, భవిష్యత్ కార్యాచరణకు స్పష్టమైన మార్గదర్శకాలను అందించే ఒక వేదికగా నిలిచింది అని స్పెషల్ ఆఫీసర్ అన్నారు. ఈ సమీక్షా నందు మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలను సమర్పించి .ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల పురోగతిని, ఎదురైన సవాళ్లను, మరియు వాటిని అధిగమించడానికి తీసుకున్న చర్యలను కూలంకషంగా చదివి వినిపించడం జరిగింది , ప్రతి శాఖ యొక్క పనితీరు పారదర్శకంగా సమీక్షించడం జరిగింది. ఈ సమీక్షా నందు ముఖ్యంగా, వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాలు వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉదాహరణకు, రైతులకు అందించిన సబ్సిడీలు, పంటల సాగు తీరు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు తీసుకున్న చర్యలు, ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో సాధించిన ప్రగతి, మరియు వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు వంటి అంశాలపై లోతైన చర్చ జరిగింది. ఈ చర్చలు కేవలం గణాంకాలకు పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న సేవలు, వాటి నాణ్యతపై కూడా దృష్టి సారించాయి. సర్పంచ్‌లు తమ గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్య లను,అభివృద్ధి అవసరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వీజైపూర్ మండల ప్రత్యేక అధికారి ఆర్డీవో శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా చేరేలా చూడాలని, అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో కార్యాలయ సూపర్ డెంట్ జి. భాగ్యలక్ష్మి మండల వివిధ గ్రామల సర్పంచ్ లు, సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మరియు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# భీమారంలో ఘనంగా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**తెలంగాణ, మంచిర్యాల జిల్లా,ఆగస్టు 19 :** 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని, తెలంగాణ ఫోటో ఑ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జైపూర్ మరియు భీమారం మండల ఫోటో ఑ వీడియో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భీమారం మండల కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను బుధవారం నాడు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ ఫోటో ఑ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధికారిక పతాకాన్ని ఆవిష్కరించారు. సమాజంలో జరిగే సంఘటనలను, శుభకార్యాలను మరియు జ్ఞాపకాలను పదిలపరిచే ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జైపూర్-భీమారం మండల యూనియన్ అధ్యక్షులు కొరకొప్పుల కిషోర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెన్న గణేష్, కోశాధికారి మండల ప్రణీత్ పాల్గొనగా, సంఘం సభ్యులు తిప్పర్తి రమేష్, పెండ్రి శ్రీనివాస్, ధారవేణి తిరుపతి, కోట్రంగి రవీందర్, కోట విష్ణు, చిలకాని సాయి, కోట మహేందర్, సిడెం ప్రకాష్, సెగ్యం రాజుకుమార్ మరియు పలువురు ఫోటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు

# ఏకరూప దుస్తులను సకాలంలో అందించండి.



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా ఆగస్టు 19 :** ఎద్యుకేషన్ డిపార్ట్మెంట్ స్కూల్ పిల్లల ఏకరూప దుస్తులను కుట్టే జైపూర్ టైలరింగ్ హబ్ ను ఎంపీడీవో శ్రీపతి బాపూరావు, ఎంఈఓ బి శ్రీనివాస్, ఏపిఎం సంతోష్ సందర్శించి సకాలంలో యూనిఫాములను కుట్టించి స్కూల్ వారీగా ఇచ్చి రశీదు పొందగలరని అదే విధంగా నాణ్యమైన రెండు కుట్లతో కొలత ప్రకారం కుట్టించి విద్యార్థిని విద్యార్థులకు అందజేయాలని ఆదేశించడం జరిగినది జైపూర్ మండలంలో 1130 మంది విద్యార్థినులు853 మంది విద్యార్థులకు అందించాలని తెలియజేశారు.వారికి 25 తారీకు లోపు అందించే విధంగా చూడాలని ఆదేశించారు.

# ఫరీద్ పేట్ గ్రామంలో పచ్చదనం కోసం మరో ముందడుగు

## మొక్కల పంపిణీ....



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: ఆగస్టు 19. (పోరు తెలంగాణ న్యూస్:)** కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం గ్రామంలో పచ్చదనం కోసం మొక్కల పంపిణీ మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా ఫరీద్ పేట్ గ్రామ పంచాయతీ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ, గ్రామ సుందరీకరణ మరియు పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జీడిపల్లి నర్సింహారెడ్డిఉప సర్పంచ్ కోల బాలగౌడ్ స్వయంగా మొక్కలు నాటి, గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అలాగే ఫరీద్ పేట్ గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, ప్రతి ఇంటి పరిసరాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మరియు గ్రామంలోని అనుకూల ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. " ఒక్క మొక్క నాటడం అంటే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం " అనే సందేశంతో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లావణ్య ఎఫ్బి ఓ పద్మ , వార్డు సభ్యులు జనపాల శ్రీకాంత్, తమ్మడి స్వామి, కమటం రేఖ, మేకల మహేశ్వరి, భూమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.మొక్కలు నాటుదాం... మొక్కలను సంరక్షిద్దాం... గ్రామాన్ని పచ్చదనంతో నింపుదాం...మన ఫరీద్ పేట్‌ను హరిత గ్రామంగా తీర్చిదిద్దుదాం అని పర్యావరణాన్ని కాపాడి భవిష్యత్ తరాలకు మంచి భవిష్యత్తును చల్లని ఈ సందర్భంగా సర్పంచ్ కోరారు.

# రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీలో మెరిసిన ముత్యం



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండలం కొలనూర్ గ్రామానికి చెందిన ఉప్పు ముత్యం జమ్మికుంట మండలం ఫోటోగ్రాఫర్స్ , వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ పోటీలలో ముత్యముకు తెలంగాణ కల్చర్ అయిన బతుకమ్మ ఫోటోకు కన్సిలేషన్ బహుమతి బుధవారం జమ్మికుంటలో అందుకున్నారు కెమెరా కన్నుతో కమనీయ దృశ్యాలు ప్రకృతి పరమైన సాంప్రదాయ చిత్రాలు తనకిమరలో బంధించడం ప్రతిబింబించే చిత్రాలు ఫోటోగ్రఫీ రంగంలో తనదైన ముద్ర వేస్తూ ప్రతిభను కనబరుస్తున్న ముత్యం.

# మల్కాపూర్ లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక ఎమ్మార్పీఎస్ బట్ట వెంకట రాములు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19. (పోరు తెలంగాణ న్యూస్:) :** మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం మల్కాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది జిల్లా ఇంచార్జ్ మంతెన సామెల్ ఆదేశాల మేరకు బుధవారం రోజునమల్కాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ కామారెడ్డి అసెంబ్లీ సమన్వయకర్త బట్ట వెంకటరాముల పాల్గొని ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని నియమించడం జరిగింది.అధ్యక్షునిగా అలంకల కిషన్ ఉపాధ్యక్షుడిగా కొమ్ము నరేందర్ అధికార ప్రతినిధిగా డి బాలరాజు ప్రధాన కార్యదర్శిగా బి కనకరాజు మరియు ఉపాధ్యక్షుడిగా నవీన్ సామనున్న సతీష్ కోశాధికారిగా అల్లం గళ్ళ అఖిల్ కార్యదర్శులుగా అల్లంఘల్లా చంద్రం నాంపల్లి సతీష్ వంశి రాజయ్య మురళి కొమ్ము సిద్దయ్య కొమ్ము రాములు నర్సింలు నవీన్ తదితరులను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం ఎస్ వి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రీ వెడ్డింగ్ విభాగంలో విజేత గా వీరేశం

## ద్వితీయ బహుమతి అందుకున్న వీరేశం






**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం ఫోటో , వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రస్థాయి ఫోటో కాంపిటీషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఫోటోగ్రఫీ ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో నిర్వహించిన ఈ పోటీలను కల్చర్, వెడ్డింగ్, ఫ్రీ వెడ్డింగ్ అనే మూడు విభాగాలుగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫ్రీ వెడ్డింగ్ విభాగంలో ఓదెల మండలం జీలకుంట గ్రామానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ ఇరుకుల్ల వీరేశం తన ప్రతిభతో ద్వితీయ బహుమతిని సాధించారు. బహుమతితో పాటు రూ.5,000 నగదు పురస్కారాన్ని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఇరుకుల్ల వీరేశంను పలువురు ఫోటోగ్రాఫర్లు, స్నేహితులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ (దిలీప్), మాజీ మున్సిపల్ చైర్మన్ తకాళ్లపల్లి రాజేశ్వరరావు, స్థానిక ఎస్సై రవి, ఫోటోగ్రఫీ మాస్టర్లు అనిల్ కుమార్, శివకుమార్, పీవీఎస్ నాగరాజు, మండల అధ్యక్షులు ముస్తఫా, రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ స్థాయిలో నిర్వహించిన పోటీలో బహుమతి సాధించడం పట్ల వీరేశం హర్షం వ్యక్తం చేశారు. తనకు ప్రోత్సాహం అందించిన ఫోటోగ్రాఫర్లకు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. జీలకుంట సర్పంచ్ రాగిడి మంగా శ్రీనివాస్ రెడ్డి వీరేశం కు శుభాకాంక్షలు తెలిపారు.

# అఖిల గాండ్ల సంఘం ( ఏ జి టి ఎస్ )నూతన రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవం

**ఉపసంహరణ అనంతరం 36 మందితో తుది జాబితా విడుదల చేసిన ఎన్నికల అధికారి వి. శ్రీనివాస్.**

**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి పటాన్చెరు నియోజకవర్గం ఆగస్టు 19 :** తెలంగాణ రాష్ట్ర అఖిల గాండ్ల సంఘం (రూ+టూ - రిజిస్టర్డ్ నం: 985/2014) నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మొత్తం 36 మందితో కూడిన తుది జాబితాను సంఘ ముఖ్య ఎన్నికల అధికారి ( సి ఆర్ ఓ) వి. శ్రీనివాస్ అధికారికంగా విడుదల చేశారు. సభ్యులందరి ఏకాభిప్రాయంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.

రాష్ట్ర ముఖ్య కార్యవర్గం,

రాష్ట్ర అధ్యక్షుడు: అసొల్ల రాజేందర్ (రంగారెడ్డి),

వర్కింగ్ ప్రెసిడెంట్: అమనగంటి శ్రీనివాస్ (కరీంనగర్),

ప్రధాన కార్యదర్శి: కొసరి సురేష్ కుమార్ (మేడ్చల్--మల్కాజిగిరి),

కోశాధికారి: బొల్లం సత్తయ్య (మేడ్చల్--మల్కాజిగిరి),

ఉపాధ్యక్షులు

బొల్లం వీర సుందర్ (కరీంనగర్), కొసరి రవీంద్రనాథ్ (మంచిర్యాల), గుజ్జేటి రాధాకిషన్ (వరంగల్), సహాయ కోశాధికారులు, కూతురు అశోక్ కుమార్ (నిజామాబాద్), పోచు కృష్ణ (కరీంనగర్), సంయుక్త కార్యదర్శులు, పోచు శ్రీనివాస్ (జగిత్యాల) సంగం శ్రీధర్ (మంచిర్యాల) వోస్వార్ నీలకంఠ్ (ఆదిలాబాద్) ఆర్గనైజింగ్ కార్యదర్శులు, బొల్లం శ్రీధర్ (కరీంనగర్),బొల్లెపల్లి కోటి (మహబూబాబాద్),రాష్ట్ర ఈ.సి. (కార్యవర్గ) సభ్యులు,

హైదరాబాద్ & రంగారెడ్డి:

కూతురు అనుదీప్ (హైదరాబాద్),తక్కళ్లపల్లి ఈశ్వర్ చరణ్, నర్మెట నారాయణ (రంగారెడ్డి),

మేడ్చల్ & సంగారెడ్డి:

పోతు అనంతలక్ష్మి, నర్మెట సుధాకర్, (మేడ్చల్--మల్కాజిగిరి),గాండ్ల యువ కిషోర్ (సంగారెడ్డి),

నిజామాబాద్ & కామారెడ్డి:

గాండ్ల నాగేశ్వరరావు (బోధన్), గాండ్ల రాజేందర్,కూతురు గోపి,రాసమల్ల పద్మ (నిజామాబాద్),టెలి కృష్ణ (కామారెడ్డి),

ఉమ్మడి కరీంనగర్:

అమనగంటిశ్రీనివాస్(జగిత్యాల),జక్కం రామాదేవి (పెద్దపల్లి)

ఉమ్మడి ఆదిలాబాద్:

తక్కడపల్లి పద్మావతి, బిర్కూర్వార్ నాగేష్ కుమార్ (ఆదిలాబాద్), గాండ్ల సంపత్ కుమార్ (మంచిర్యాల), కొసరి జయప్రద (మంచిర్యాల),షిండే గణేష్ (ఆసిఫాబాద్),

ఉమ్మడి వరంగల్ & ఖమ్మం:

నర్మెట రవీందర్ (వరంగల్), -ఎర్రంశెట్టి సంతోష్ కుమార్ (మహబూబాబాద్), కన్నం గౌరయ్య (ఖమ్మం), జక్కం సర్వేశ్వరరావు (భద్రాద్రి కొత్తగూడెం), రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల సమతుల్యతతో ఎన్నికైన నూతన రాష్ట్ర కార్యవర్గానికి సంఘం ప్రతినిధులు, బాధ్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రమాణ స్వీకార మహోత్సవ వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని ఎన్నికల అధికారి వి. శ్రీనివాస్ పేర్కొన్నారు.

**AGTS STATE BODY ELECTIONS | REG. NO 985/2014 | AUGUST - 2026**
**THE FINAL LIST OF CANDIDATES AFTER WITHDRAWAL Dt: 18-08-2026**

| | CANDIDATE NAME | | | NOMINATION FOR | DATE | NO. OF NOM. | REMARKS |
|---|---|---|---|---|---|---|---|
| 1 | ASOLLA RAJENDER | SHANKAR | RANGAREDDY | PRESIDENT | 11-08-2026 | 1 | |
| 2 | AMANAGANTI SRINIVAS | BHUMAIAH | KARIMNAGAR | WORKING PRESIDENT | 10-08-2026 | 1 | |
| 3 | KOSARI SURESH KUMAR | RAJARAM | MEDCHAL MALKAJGIRI | GENERAL SECRETARY | 11-08-2026 | | |
| 4 | BOLLAM VEERA SUNDAR | BHOOMA LINGAIAH | KARIMNAGAR | VICE - PRESIDENT | 11-08-2026 | | |
| 5 | KOSARI RAVINDRANATH | MEGHANATH | MANCHIRYAL | VICE - PRESIDENT | 10-08-2026 | | |
| 6 | GUJJETI RADHA KISHAN | LAXMI NARAYANA | WARANGAL | VICE - PRESIDENT | 10-08-2026 | | |
| 7 | BOLLAM SATHAIAH | GANGARAM | MEDCHAL MALKAJGIRI | TREASURER | 11-08-2026 | 1 | |
| 8 | KUTHURU ASHOK KUMAR | NARAYANA | NIZAMABAD | CO-TREASURER | 11-08-2026 | | |
| 9 | POCHU KRISHNA | SATHAIAH | KARIMNAGAR | CO-TREASURER | 11-08-2026 | | |
| 10 | POCHU SRINIVAS | MALLAIAH | JAGITHYAL | JOINT SECRETARY | 11-08-2026 | | |
| 11 | SANGAM SRIDHAR | THIRUPATHI | MANCHIRYAL | JOINT SECRETARY | 11-08-2026 | | |
| 12 | VOSWAR NEELAKANTH | KISTU | ADILABAD | JOINT SECRETARY | 11-08-2026 | | |
| 13 | BOLLAM SRIDHAR | SADHANANDAM | KARIMNAGAR | ORAGANIZING SECRETARY | 10-08-2026 | | |
| 14 | BOLLEPALLI KOTI LINGAM | SOMANAGAIAH | MAHABUBABAD | ORAGANIZING SECRETARY | 11-08-2026 | | |
| 15 | TAKKADAPALLI PADMAVATHI | SURENDAR | ADILABAD | E.C MEMBER | 12-08-2026 | | |
| 16 | KUTHURU ANUDEEP | GOPI | HYDERABAD | E.C MEMBER | 11-08-2026 | | |
| 17 | TAKKALLAPALLY ESHWAR CHARAN | RAJENDRA KUMAR | RANGAREDDY | E.C MEMBER | 11-08-2026 | | |
| 18 | POTHU ANANTHA LAXMI | PRAKASH RAO | MEDCHAL MALKAJGIRI | E.C MEMBER | 11-08-2026 | | |
| 19 | GANDLA YUVA KISHORE | YADHAGIRI | SANGAREDDY | E.C MEMBER | 11-08-2026 | | |
| 20 | NARMETA NARAYANA | RAJAVEERU | RANGAREDDY | E.C MEMBER | 11-08-2026 | | |
| 21 | NARMETA SUDHAKAR | BHADRAIAH | MEDCHAL MALKAJGIRI | E.C MEMBER | 11-08-2026 | | |
| 22 | GANDLA NAGESHWAR RAO | HANUMANDLU | BODHAN, NIZAMBAD | E.C MEMBER | 10-08-2026 | | |
| 23 | GANDLA RAJENDAR | PEERAJI | NIZAMABAD | E.C MEMBER | 11-08-2026 | | |
| 24 | KUTHURU GOPI | SAYANNA | NIZAMBAD | E.C MEMBER | 11-08-2026 | | |
| 25 | TELI KRISHNA | MAADAIAH | KAMAREDDY | E.C MEMBER | 12-08-2026 | | |
| 26 | RASAMALLA PADMA | RAMU | NIZAMBAD | E.C MEMBER | 12-08-2026 | | |
| 27 | AMANAGANTI SRINIVAS | SATHYA NARAYANA | JAGITHYAL | E.C MEMBER | 11-08-2026 | | |
| 28 | JAKKAM RAMADEVI | RAJALINGAIAH | PEDDAPALLI | E.C MEMBER | 10-08-2026 | | |
| 29 | GANDLA SAMPATH KUMAR | SHANKARAIAH | MANCHIRYAL | E.C MEMBER | 10-08-2026 | | |
| 30 | KOSARI JAYAPRADA | SUDHAKAR | MANCHIRYAL | E.C MEMBER | 12-08-2026 | | |
| 31 | KANNAM GOWRAIAH | BHADRAIAH | KHAMMAM | E.C MEMBER | 11-08-2026 | | |
| 32 | JAKKAM SARVESHWAR RAO | SEETHAIAH | BHADRADRI KOTHAGUDEM | E.C MEMBER | 11-08-2026 | | |
| 33 | BIRKURWAR NAGESH KUMAR | GOVIND RAO | ADILABAD | E.C MEMBER | 11-08-2026 | | |
| 34 | SHENDE GANESH | SADHU | ASIFABAD | E.C MEMBER | 11-08-2026 | | |
| 35 | NARMETA RAVINDAR | PULLAIAH | WARANGAL | E.C MEMBER | 10-08-2026 | | |
| 36 | ERRAMSHETTI SANTHOSH KUMAR | NAGAIAH | MAHABUBABAD | E.C MEMBER | 11-08-2026 | | |

Location: Hyderabad
Date: 18-08-2026

Chief Election Officer
V.SRINIVAS

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

**కలెక్టర్ కె. హరిత.....**






**పోరు తెలంగాణ ఆగస్టు 19: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడత నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశాలు జారీ చేసింది. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ సమక్షంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు, పురపాలక సంఘాల కమిషనర్లతో మొదటి విడత పురోగతి, 2వ విడత జాబితాపై సమీక్ష సమావేశం జరిగింది. జిల్లాలో మొదటి విడతలో 8,851 ఇండ్లు మంజూరవగా, 1,100 ఇండ్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదు. కారణాలను నివేదిక రూపంలో సమర్పించి వెంటనే పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించింది. బేస్మెంట్, రూఫ్, స్లాబ్ లెవెల్ పనులు వేగవంతం చేయాలని సూచించింది. 2వ విడత జాబితాలో అనర్హులు ఉండకుండా, అర్హులకే చోటు కల్పించాలని, గుడిసెలలో నివసించే వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, గ్రామ సభ ద్వారా అర్హుల పేర్లతో తీర్మానాలు చేయాలని, ప్రతి లబ్ధిదారుడి ఇంటిని ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించింది. మున్సిపాలిటీలలో బలమైన రూఫ్ ఉన్న అర్హులను గుర్తించాలని సూచించింది.

# నకిలీ బంగారంతో ఫైనాన్స్ సంస్థకు టోకరా - ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన సిసియస్ పోలీసులు



**పోరు తెలంగాణ, ఖమ్మం జిల్లా బ్యూరో నాగకృష్ణ, ఆగస్టు19:** నకిలీ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి ఫైనాన్స్ సంస్థ నుంచి రుణాలు పొందుతూ మోసాలకు పాల్పడుతున్న ముఠాపై ఖమ్మం సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సిసియస్ ఇన్స్పెక్టర్ ఎస్. రాజ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ముత్తుట్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు సిసియస్ ఏసీపీ మహ్మద్ సర్వర్ పర్యవేక్షణలో విచారణ జరిపి ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి 11 నకిలీ బంగారు ఉంగరాలు, మొత్తం 35.8 గ్రాముల బరువు, సుమారు రూ.4 లక్షల విలువైన ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీసీఎస్ ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు నకిలీ బంగారు ఆభరణాలను సిద్ధం చేసుకుని వాటిని అసలైన బంగారంగా చూపిస్తూ నగరంలోని ముత్తుట్ గోల్డ్ లోన్ సంస్థల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందిన్నట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా ఇసంపల్లి సాయివంశీ (34) షేక్ మహబూబ్ (33), జూపల్లి రాము (35)లను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో కొక్కిరేణి సందీప్ (27), ముండాడ రామచందర్ (39) పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని తెలిపారు. కేసు దర్యాప్తులో చురుకుగా పనిచేసిన ఎస్ఐ వంశీ, హెడ్ కానిస్టేబుల్ ఓం ప్రకాశ్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, హరి, జానీ, నరసింహారావు, శ్రీధర్, సతీష్ తదితరులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

**పోలీసు అధికారులకు డీఎల్ఎస్ఏ చైర్మన్ శ్రీ ఎం. నాగరాజు సూచన**







**పోరు తెలంగాణ,ఖమ్మం జిల్లా బ్యూరో నాగకృష్ణ, ఆగస్టు 19:** సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని డీఎల్ఎస్ఏ చైర్మన్ శ్రీ ఎం. నాగరాజు పోలీసు అధికారులకు సూచించారు. న్యాయ సేవా సదన్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజీకి అనుకూలమైన కాంపౌండబుల్ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో జాతీయ లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో రాజీ పరిష్కారానికి అనువైన కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకుని లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రాజీ పరిష్కారానికి అనువైన కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన రీతిలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మనసా, అడిషనల్ డీసీపీ (అడ్మిన్), ప్రాసిక్యూషన్ అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గనుల మూసివేత ప్రభావిత ప్రాంతాలలో పరిరక్షణ చర్యలు చేపట్టాలి

**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి**






**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా,ఆగస్టు 19, 2026:** బొగ్గు గనుల మూసివేతతో ప్రభావితమయ్యే ప్రాంతాల పరిరక్షణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం దేశవ్యాప్తంగా గల కోల్ ఇండియా, నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్, ఇతర బొగ్గు సంస్థలు, సింగరేణి ప్రభావిత జిల్లాలకు చెందిన జిల్లా కలెక్టర్లు, సంబంధిత నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బొగ్గు గనుల మూసివేత ప్రభావాలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ గనులను మూసివేసే సమయంలో పర్యావరణ పరిరక్షణపై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, గనుల మూసివేత అనంతరం పరిసర ప్రాంతాలపై పడే ప్రభావాన్ని తగ్గించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గనుల మూసివేత కారణంగా ప్రభావితమయ్యే పరిసర గ్రామాల ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడం, జీవనోపాధిని మెరుగుపరచడం, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలలో చేపడుతున్న గనుల మూసివేత సంబంధిత కార్యకలాపాలు, ప్రభావిత గ్రామాలలో సామాజిక అభివృద్ధి, ప్రజల ఉపాధి కల్పనకు సంబంధించి చేపడుతున్న కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైన్స్ ఎ.డి. జగన్మోహన్, పర్యవేక్షకులు మధుసూదన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

**కలెక్టర్ కె.హరిత....**



**పోరు తెలంగాణ ఆగస్టు 19: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగిక సంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించింది. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని పాలనాధికారి ఛాంబర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.నాగేంద్ర, ఇతర వైద్యాధికారులతో కలిసి ప్రచార గోడ ప్రతులను ఆవిష్కరించింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో లైంగిక సంక్రమిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించింది. వ్యాధులపై సందేహాలు, ప్రమాద అవకాశం, వివరాలు తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా సమాచారం పొందవచ్చని తెలిపింది.

# డివైండర్ డీకొని క్యాబిన్ పై పడ్డ గ్రానైట్ బండ క్యాబిన్ లో ఇరుకున్న డ్రైవర్ తీవ్ర గాయాలతో బయటపడ్డ వైనం



**పోరు తెలంగాణ, ఖమ్మం నేలకొండపల్లి, ఆగస్టు 19:-** గ్రానైట్ రాళ్ల తో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు డివైండర్ ను డీకొనటంతో ప్రమాదం జరిగింది. డ్రైవర్ కు తీవ్ర గాయాలైయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం తెల్లవారు జామున నేలకొండపల్లి నుంచి ఖమ్మం వెళ్తున్న గ్రానైట్ లారీ కి ప్రమాదం జరిగింది. నేలకొండపల్లి మండలం లోని గువ్వలగూడెం- ముదిగొండ మండలం లోని గోకినేపల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారి పై లారీ ప్రమాదవశాత్తు డివైండర్ ను ఢీకొట్టింది. దీంతో గ్రానైట్ రాళ్లు క్యాబిన్ పై పడటంతో డ్రైవర్ నాగరాజు క్యాబిన్ లో ఇరుక్కున్నారు. సమాచారం అందుకున్న నేషనల్ హైవే సిబ్బంది ఘటనా స్థలం కు చేరుకుని క్యాబిన్అద్దాలను పగలగొట్టి డ్రైవర్ ను సురక్షితంగా బయటకు తీశారు. తీవ్ర గాయాలైన డ్రైవర్ ను చికిత్స కోసం ఖమ్మం తరలించారు. టైర్ పంక్షర్ కావటం వలన డివైండర్ ను డికొట్టినట్లు సమాచారం. ఈప్రాంతంలో అధిక లోడు తో గ్రానైట్ వాహనాలు తిరగటం, అతి వేగంగా నడపటం వలన ఇటీవల అనేక ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

# అనమలిస్ ఓటర్లకు నోటీసుల జారీకి చర్యలు

**ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి....**






**పోరు తెలంగాణ ఆగస్టు 19: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అనమలిస్ జాబితాలోని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఆదేశించింది. బుధవారం హైదరాబాద్‌లోని కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాలలో వ్యత్యాసం ఉన్న అనమలిస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి సంతకం తీసుకోవాలని, నోటీసులో విచారణ ప్రదేశం, తేదీ పొందుపరచాలని, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించింది. బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ల ద్వారా నోటీసులు అందించి, సరైన ఆధారాలతో ఓటర్లు విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. సమావేశంలో జిల్లా కేంద్రంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు పాల్గొన్నారు. ముసాయిదా ఓటరు జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రదర్శించినట్లు, జిల్లాలోని 2 నియోజకవర్గాల్లో సుమారు 94 వేల మంది అనమలిస్ ఓటర్లు ఉన్నారని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారికి నోటీసులు జారీ చేయనున్నట్లు కలెక్టర్ కె.హరిత తెలిపింది.

# ఏకలవ్య గురుకుల పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**కలెక్టర్ కె.హరిత....**



**ఫోర్ తెలంగాణ ఆగస్టు 19: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో బోధన, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపింది. బుధవారం పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశానికి హాజరైన సందర్భంగా, గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు ఈ పాఠశాల కీలకమని పేర్కొంది. గ్రామీణ, మారుమూల ప్రాంతాల విద్యార్థులు ఎక్కువగా ఉన్న దృష్ట్యా, స్టేట్ సిలబస్ నుండి సీబీఎస్ఈ సిలబస్‌కు మారే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించేలా ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన బోధన అందించాలని కలెక్టర్ సూచించింది. విద్యార్థులు గైర్హాజరు కాకుండా అధ్యాపకులు పర్యవేక్షించాలని, తల్లిదండ్రులు బోధన పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కోరింది. మాతృభాష నుండి ఆంగ్లానికి మారేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించింది. అనారోగ్యంతో చదువుపై దృష్టి పెట్టలేని విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మెనూ ప్రకారం సకాలంలో పోషకాహారం అందించాలని సూచించింది. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశం లబ్ధిదారులకు వస్త్రాలు అందజేసిన మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, సర్పంచ్ ఐరెని నరసయ్య





**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి:ఆగస్టు 19.(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో బుధవారం నలుగురు నాగారపు రమ్య రాజు, నిమ్మ అర్చన రమేష్, నర్రాగుల మానేవ్వ శేఖర్, కొడిప్యాక నిరంజన్ గౌడ్, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు నూతన గృహప్రవేశం సందర్భంగా వారికి నూతన వస్త్రాలను మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ సర్పంచ్ ఐరెని నరసయ్యతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సొంతింటి కల నెరవేర్చాలని ఆలోచనతో పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి నిర్మించడం జరుగుతుందన్నారు. దోమకొండలో 161 మందికి ఇండ్లు మంజూరయ్యాయని అందులో 80 మంది గృహప్రవేశం చేసినట్లు తెలిపారు. ఇండ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం గుర్తించి వారికి ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, మంత్రి సీతక్కలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కదిరి గోపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాములు నర్సింలు బాలరాజు, సుధాకర్, సిద్ధ రాములు, నయీమ్, సంతోష్, రాజయ్య, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓదెల మండలంలో నీ ఉపాధ్యాయులకు మొదటి కాంప్లెక్స్ సమావేశం

**మండల విద్యాధికారి రమేష్**



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఆగస్టు 19 బుధవారం పెద్దపెల్లి జిల్లా ఓదెల పాఠశాల ఆవరణలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు మొదటి కాంప్లెక్స్ సమావేశం జరిగినది ఈ సమావేశం లో ఎఫ్ ఎల్ ఎన్ క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు ఈ సందర్భంగా. ఎంఈఓ రమేష్ మాట్లాడుతూ ఓదెల మండలం పెద్దపల్లి జిల్లాలో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేయాలి అన్నారు, పద్మ మాట్లాడుతూ విద్యార్థులలో గణితం, ఇంగ్లీష్ సామర్థ్యాల సాధన కు కృషి చేయాలని తెలిపారు, ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీలు గా కవి శ్వర్ ,గట్టయ్య చేరాలు టీచర్లకు ఇంగ్లీష్ గణితం సామర్థ్యాలపై అవగాహన కల్పించారు. ఓదెల మండలంలోని టీచర్లు పాల్గొన్నారు.

# రహదారుల అభివృద్ధి తో పరిశ్రమలు,ఉపాధి అవకాశాలు విస్తరణ



**పెద్దపల్లి, పోరు తెలంగాణ, ఆగష్టు 19 :** సుల్తానాబాద్ మండలం గర్రె పల్లిలో బుధవారం రూ: 219 కోట్ల 67 లక్షల విలువైన హైబ్రిడ్ యాన్యూటి మోడల్( హెచ్ఎఎం) నాన్ ప్లాన్ రహదారి అభివృద్ధి పనులకు మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీదర్ బాబు, ప్రభుత్వ విప్ చింత కుంట విజయ రమణారావు, జిల్లా కలెక్టర్ , రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి శంకుస్థాపన చేశారు.

# బాలికల భద్రతపై షీ టీం అవగాహన కార్యక్రమం



**పోరు తెలంగాణ ఆగస్టు 19: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు చింతలమానేపల్లి మండల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ షీ టీం ఇన్‌చార్జి ఏఎస్ఐ సునీత విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై, మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలపై వివరించారు. ఆపద సమయంలో స్పందించే విధానం, డయల్ 100, 112 వినియోగం, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమ హక్కులు తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని, వేధింపులు ఎదురైతే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. సమస్యలు ఎదురైతే కాగజ్‌నగర్ షీ టీం నంబర్ 8712670565కు తెలియజేయాలని పేర్కొన్నారు.

# 75% స్థానిక రిజర్వేషన్ పునరుద్ధరణ డిమాండ్

ఆసిఫాబాద్‌లో ఏజెన్సీ బంద్....



**పోరు తెలంగాణ ఆగస్టు 19: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో స్థానిక ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ నిరుద్యోగులకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఆదివాసీ తుడుందెబ్బ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఏజెన్సీ బంద్ ప్రశాంతంగా ముగిసింది. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ నేతృత్వంలో నాయకులు ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహించి ప్రభుత్వ విధానాలపై నిరసన తెలిపారు బంద్‌కు పట్టణ మార్కెట్ సముదాయాలు, వ్యాపార సంస్థలు, ప్రైవేటు విద్యాసంస్థలు మద్దతు తెలిపాయి. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, డీఎడ్, బీఎడ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మద్దతుగా విద్యాసంస్థలను మూసివేశారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు గతంలో ఉన్న 75% స్థానిక రిజర్వేషన్‌ను ప్రస్తుత పోలీస్ నోటిఫికేషన్‌లో తొలగించి జనరల్‌గా మార్చడంపై నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జీవో నంబర్ 3 రద్దుతో పాటు 1/70 చట్టం, పెసా చట్టాలను ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు. ఆదివాసీ ప్రాంతాలకు కొత్త జీవోలు అవసరం లేదని, ఉన్న ఆదివాసీ చట్టాలు, జీవోలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతీ, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మర్కల్ మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ సెలబ్రేషన్స్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19. (పోరు తెలంగాణ న్యూస్) :** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల్ మర్కల్ నందు ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్ )నందు ఫ్రెషర్స్ పార్టీ సెలెబ్రేషన్స్ చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి జ్యోతి ప్రజ్వలన చేశారు.తదనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.విద్యార్థులంతా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో, నృత్యాలతో అలరించారు. మిస్ ఫ్రెషర్ గా ప్రియదర్శిని, మిస్ స్టైలిష్ గా భవాని, మిస్ టాలెంట్ గా మన్విత ఎంపికయ్యారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి, కల్చరల్ కమిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ కే. వనజ, సభ్యులు నవనీత, ప్రియాంక, అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాగజ్‌నగర్‌లో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం వేడుకలు



**పోరు తెలంగాణ ఆగస్టు 19: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్ పట్టణంలోని లక్ష్మీ డిజిటల్ కలర్ ల్యాబ్‌లో ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డ్యాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ (టి జి పి వి డబ్ల్యు ఎ) జెండాను తొలిసారిగా ఆవిష్కరించి, కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. మొదటిసారి జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం గర్వకారణమని యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. సమాజ జ్ఞాపకాలను, సంస్కృతిని, చరిత్రను చిత్రాల రూపంలో భద్రపరిచే ఫోటోగ్రాఫర్లందరికీ ఈ దినోత్సవం ప్రత్యేకమైనదని, జెండా ఆవిష్కరణ ఫోటోగ్రాఫర్ల ఐక్యత, గౌరవం, వృత్తి అభివృద్ధికి ప్రతీక కావాలని అభిప్రాయపడ్డారు. ఫోటోగ్రఫీ వృత్తి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ఫోటోగ్రాఫర్ల ఐక్యత చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షించారు.

# విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య





**పోరు తెలంగాణ ప్రతినిధి మంచిర్యాల జిల్లా,ఆగస్టు 19, 2026:** ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో రుచికరమైన, పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల కేంద్ర వంటశాలను సందర్శించి వివిధ విద్యాసంస్థలకు అల్పాహారం, జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, అసిస్టెంట్ కమిషనర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలలో జరుగుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్, అక్షయ పాత్ర ఫౌండేషన్, మన్నా ట్రస్ట్ ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంబంధిత విద్యాసంస్థలకు అందించే అల్పాహారం, మధ్యాహ్నం భోజనం సక్రమంగా, నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన ప్రభుత్వ ఆసుపత్రి లోని బిఈఆర్ఎ గదిని ఆర్ఎంఓ, ఈఎన్‌టి వైద్య నిపుణులు, డిఆర్‌డిఎ సదరం అధికారులతో కలిసి సందర్శించారు. బిఈఆర్ఎ గదిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలను అధికారులతో మాట్లాడి సమీక్షించారు. సంబంధిత గుత్తేదారుతో మాట్లాడి గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, అవసరమైన పనులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసి సేవలు సక్రమంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం విద్యాశాఖ సమన్వయంతో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం నిర్వహిస్తున్న సదరం ప్రత్యేక శిబిరాన్ని మంచిర్యాల ఆర్ఎంఓ, సదరం అధికారులు, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారిలతో కలిసి సందర్శించి శిబిరంలో జరుగుతున్న ఏర్పాట్లు, పిల్లలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన ధ్రువపత్రాలు, వైద్యపరమైన అంచనాలు, ఇతర సేవలు సులభంగా, సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పిల్లలు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శిబిరాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అవసరమైన సేవలు అందేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యపై పెట్టే ఖర్చు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడి

ప్రభుత్వం కల్పించే విద్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద





**పోరు తెలంగాణ, మంచిర్యాల,ఆగస్టు 19, 2026:** ప్రభుత్వం విద్యారంగంపై పెట్టే ఖర్చు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడి లాంటిదని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలో 50 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, స్నానపు గదులు, మరమ్మత్తుల పనులకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, గిరిజన సంక్షేమ అధికారి సురేష్, మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ పాఠశాలకు 50 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులు, 30 లక్షల రూపాయల డి.ఎం.ఎఫ్.టి. నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. 10వ తరగతి పూర్తి అయిన తర్వాత విద్యార్థుల కొరకు 200 వందల కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 2 వేల 500 మంది విద్యార్థులు చదువుకునేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను వసతి గృహ సదుపాయంతో నిర్మించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో సన్న బియ్యంతో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం జరుగుతుందని, విద్యార్థుల సంక్షేమంలో భాగంగా 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని, భవిష్యత్తులో మరిన్ని నియామకాలు చేపట్టి విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చెన్నూర్ మండల కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని పూర్తి సౌకర్యాలతో నిర్మించడం జరిగిందని, త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని, ప్రజల సౌకర్యార్థం 23 మంది వైద్యులను నియమించడం జరిగిందని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన విద్యా హక్కును రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని, మెరుగైన విద్యా విధానం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యాసంస్థలలో మధ్యాహ్న భోజనం, విద్యా బోధన, ఇతర సదుపాయాలపై ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గంలో 3 ఆశ్రమ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థినులకు ప్రత్యేకంగా మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి పాఠశాలను విద్యార్థులకు సౌకర్యవంతంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని, తరగతి గదులు, వసతి గదులు, త్రాగునీరు, భోజనశాల ఇతర సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. భీమారంలో భోజనశాల, అదనపు గదులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. జైపూర్ మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే మంచిర్యాల జిల్లాలో 6.14 శాతం అదనంగా విద్యార్థుల నమోదు జరిగిందని తెలిపారు. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. లి చెన్నూర్ లో చెన్నూర్ పట్టణంలోని మహిళా శక్తి భవన్ లో కాకా వెంకటస్వామి ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా కాకా వెంకటస్వామి ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసి అభ్యర్థులకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా వృత్తి విద్య కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి కల్పించడం జరుగుతుందని, టామ్ కామ్ సమన్వయంతో విదేశాలలో ఉన్న ఉపాధి అవకాశాలను రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు అందించేందుకు జర్మన్, జపనీస్ భాషలో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు మందమర్రిలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి దాదాపు 100 మందికి శిక్షణ అందించడం జరుగుతుందని, అభ్యర్థులు ఏకాగ్రతతో శిక్షణ పొంది విదేశీ ఉపాధి అవకాశాలను పొందాలని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల సమస్యలు, సూచనలు, ఫిర్యాదుల కొరకు ఓపెన్ బాక్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజల సమస్య బాధ్యతతో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో ఉండే ఈ ఓపెన్ బాక్స్ లో తమ ఫిర్యాదును వేసినట్లయితే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు అందుబాటులో ఉన్న శిక్షణను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. భవిష్యత్తును దెబ్బతీసే అంశాలకు దూరంగా ఉండి కెరీర్ పై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా ప్రభుత్వం ఎస్.ఐ., కానిస్టేబుల్ నియామకం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఉచిత శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలలో రాణించి ఉద్యోగం సాధించాలని తెలిపారు. - చెన్నూర్ మండలం కిష్టంపేటలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేపట్టిన రెనోవేషన్ పనులు పూర్తి కావడంతో నూతనంగా నిర్మించిన మొదటి అంతస్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం పొడిగింపు పనులకు 1 కోటి 25 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులు, 20 లక్షల రూపాయల సి.బి.ఎఫ్. నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. విద్యపై ప్రభుత్వం పెట్టే ఖర్చు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడి లాంటిదని, ప్రభుత్వం కల్పిస్తున్న విద్య అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో ప్రజల సౌకర్యం సిసి రోడ్లు, మురుగునీటి వ్యవస్థ, హైమాస్ లైట్లు, త్రాగునీరు అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్యకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని, సమాజంలో కళాశాల విద్యార్థుల పాత్ర కీలకమైనదని, రాష్ట్ర భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉంటుందని, చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని, ప్రయత్నించడమే మొదటి విజయమని తెలిపారు. విద్యార్థులు తమ ఆలోచనలను సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మార్చాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన విద్యా వసతులు కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కళాశాలలో అవసరమైన అధ్యాపకుల నియామకం, తరగతి గదులు, ల్యాబ్ లు, సిబ్బంది నియామకం చేపట్టి విద్యార్థులకు సమగ్ర విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో నైపుణ్యం పెంపొందించుకోవాలని, 100 శాతం తరగతులకు హాజరు కావాలని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలలో నిలిచి సమాజానికి సేవలు అందించాలని తెలిపారు.

మందమర్రిలో

మందమర్రి మండల కేంద్రంలో కాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఉచిత శిక్షణ కేంద్రం ద్వారా ఎస్.ఐ., కానిస్టేబుల్ నియామకానికి అవసరమైన శిక్షణను అభ్యర్థులకు అందించడం జరుగుతుందని తెలిపారు. అవకాశం ఉన్న చోట వచ్చిన ఉద్యోగాన్ని విధిగా నిర్వహించాలని, అభివృద్ధి చెందాలని తెలిపారు. నిరుద్యోగ యువత కొరకు అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ ను ఏర్పాటు చేసి వృత్తి విద్యా కోర్సులను అందించడం జరుగుతుందని, సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. యువతకు ఖరీదైన శిక్షణ భారం కాకూడదనే ఉద్దేశంతో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విదేశాలలో ఉద్యోగం కొరకు జర్మన్ భాష నేర్చుకుంటున్న అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విదేశీ ఉద్యోగాలలో రాణించాలని తెలిపారు. ఈ ప్రాంతం నుండి వందలాదిమంది యువత ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాలను వెలుగులు నింపాలని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా విశేషంగా కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి వృత్తి విద్యా శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఐ., కానిస్టేబుల్ నియామకాల కొరకు అభ్యర్థులకు శిక్షణ అందించేందుకు ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. పోటీ ప్రపంచంలో ఏకాగ్రతతో శిక్షణ పొంది పట్టుదలతో ఉపాధి కొరకు ప్రయత్నిస్తేనే విజయం సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో 28 మోడల్ సోలార్ విలేజ్ లు ఎంపిక తొలి విడతలో గృహాజ్యోతి

లబ్ధిదారులకు ప్రాధాన్యత.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17,426 సర్వీస్ల గుర్తింపు

టీజీ రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్ పి.ఆజయ్కుమార్.





**పోరు తెలంగాణ,నేలకొండపల్లి ఆగస్టు 19:** ఖమ్మం ఉమ్మడి జిల్లాలో 28 గ్రామాలను సోలార్ మోడల్ విలేజ్ లు గా ఎంపిక చేసినట్లు టీజీ రెడ్కో జిల్లా మేనేజర్ పి.ఆజయ్కుమార్ తెలిపారు. మండలం లోని చెరువుమాధారం మోడల్ సోలార్ విలేజ్ పథకం పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..ఉమ్మడి జిల్లాలో 28 గ్రామాలలో మొత్తం 17,426 సర్వీస్ లను గుర్తించినట్లు తెలిపారు. సోలార్ వెలుగులు ఏర్పాటు లో మొదట గా గృహా జ్యోతి లబ్దిదారులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అందులో 4,669 వ్యవసాయ కనెక్షన్ లు ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సోలార్ మోడల్ విలేజ్ పథకం పనులు శర వేగంగా సాగుతున్నట్లు తెలిపారు. వ్యవసాయం కు 7.5 కిలోవాట్ల సోలార్ పంపు సెట్స్, గృహాలకు 2. కిలో వాట్ల రూఫ్టప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛమైన, పునరుత్పాదక విద్యుత్ ను ప్రోత్సాహించటంతో పాటు ప్రజలకు అదనపు విద్యుత్ ను గ్రిడ్ కు ఎగుమతి చేయటం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. లబ్దిదారులకు ఎలాంటి ఖర్చు లేకుండా, ఇళ్ల పై 2 కిలో వాట్స్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయటానికి దాదాపు రూ.1.36 లక్షలు, వ్యవసాయ కనెక్షన్ లకు 7.5 కిలో వాట్ల సోలార్ పంపు సెట్ ఏర్పాటు కు రూ.4.95 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఇంటి యాజమానులకు ఏడాదికి కనీసం రూ.20 వేల వరకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. పథకం విద్యుత్ ఖర్చుల ను తగ్గించుకోవటం తో పాటు వినియోగం అనంతరం విద్యుత్ గ్రిడ్ కు ఎగుమతి చేసి అదనపు ఆదాయం పొందుతారని పేర్కొన్నారు. సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు కు ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతీ కుటుంబం ఈ పథకం ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పీడీఎస్ బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై పీడీ యాక్ట్ : పోలీస్ కమిషనర్



**పోరు తెలంగాణ, ఖమ్మం, ఆగస్టు 19:** పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ చేయడం, అంతర్రాష్ట్రాలకు తరలించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ అక్రమంగా ఆర్థిక లాభాలు ఆర్జిస్తున్న కాజా రామారావు ఏ జయంతి రామారావుపై పీడీ యాక్ట్‌ను అమలు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా, వీరులపాడు మండలం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నిందితుడు కాజా రామారావు రేషన్ డీలర్లు, వారి ఏజెంట్ల ద్వారా కార్డుదారులకు అందాల్సిన సబ్సిడీ పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా సేకరించేలా లబ్ధిదారుల బయోమెట్రిక్ వేలిముద్రలను దుర్వినియోగం చేసి బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయిస్తున్నట్లు తెలిపారు. 2026 ఏప్రిల్ 28 నుంచి మే 26 వరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని కల్లూరు, తల్లాడ, ఎర్రుపాలెం, చంద్రుగొండ పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై పీడీఎస్ బియ్యం అక్రమ కొనుగోలు సంబంధించి మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ కేసుల్లో భారతీయ న్యాయ సంహిత (BNS), ఎసెన్షియల్ కమాడిటీస్ యాక్ట్ (ECA), తెలంగాణ పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్స్‌కు సంబంధించిన వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలోనూ ఇదే తరహా కేసులు నిందితుడిపై 2024లో కూడా ఖమ్మం జిల్లాలోని తల్లాడ, కల్లూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారానికి సంబంధించి మరో రెండు కేసులు నమోదయ్యాయని, అయినప్పటికీ తన అక్రమ కార్యకలాపాలను మార్చుకోకుండా కొనసాగించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యకలాపాల ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఉద్దేశించిన ఆహార భద్రత వ్యవస్థకు తీవ్ర విఘాతం కలుగుతోందని, సమాజానికి అవసరమైన నిత్యావసర వస్తువుల సరఫరా వ్యవస్థను కూడా ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై గతంలో పలుమార్లు కేసులు నమోదు కావడంతో పాటు, దీచీూా సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసినప్పటికీ తన ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని, ఈ నేపథ్యంలో పీడీ యాక్ట్ అమలు చేసి సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం కాజా రామారావును బుధవారం అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని చంచల్‌గూడ సెంట్రల్ జైలు తరలించడం జరిగింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

# అభివృద్ధి పనులకు అడ్డుపడొద్దు

## ఎమ్మెల్యే కోవ లక్ష్మి వ్యక్తిగత విమర్శలు పక్కన పెట్టి నియోజకవర్గం అభివృద్ధి కి సహకరించాలి....

## కాంగ్రెస్ జిల్లా డి సి సి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ....



**పోరు తెలంగాణ ఆగస్టు 19: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం మానుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మిని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ డిమాండ్ చేసింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావుతో కలిసి డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టిందని, ఆ అప్పులు తీరుస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేస్తోందని పేర్కొంది. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించలేదన్న మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని విమర్శించింది. అసెంబ్లీ, సెక్రటేరియట్ భవనాలు ప్రజాధనంతో నిర్మించినవేనని, వాటిని వ్యక్తిగత ఘనతగా చెప్పుకోవడం సరికాదని అభిప్రాయపడింది. మహిళలకు కుట్టు మిషన్లు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమంలో ఆటంకాలు సృష్టించడాన్ని ప్రశ్నించింది. పర్యాటక శాఖ నుంచి నియోజకవర్గానికి రూ.10 కోట్లు కేటాయించిన మంత్రిని అభినందించాల్సింది పోయి విమర్శించడం తగదని పేర్కొంది. అభివృద్ధికి అడ్డుపడితే జవాబు చెప్పాల్సింది ఆసిఫాబాద్ ప్రజలేనని హెచ్చరించింది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేస్తుందన్న బీఆర్ఎస్ ప్రచారాన్ని ఖండించింది. పెండింగ్ బిల్లులను చెల్లిస్తూ అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నామని, ఈ పథకాలను నిలిపివేసే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. వీఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షులు తరిఖ్, భీమ్ రావ్, ఆర్జీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కోవా ఇందిర, పాటు వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ కోదండరాం..

# పార్టీ పటిష్టత కోసం కృషి చేయండి



**మహేశ్వరం, ఆగస్టు 19, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** తెలంగాణ జన సమితి పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. బుధవారం మేడ్చల్ జిల్లా కమిటీ సమావేశానికి ఎమ్మెల్సీ కోదండరాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. పార్టీ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములను చేయాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జన సమితి నేతలు ముందు వరుసలో ఉండాలని ఆయన తెలిపారు. మేడ్చల్ జిల్లాలో పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.మేడ్చల్ జిల్లా అధ్యక్షునిగా మారం లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దయాకర్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసు ను ఎన్నుకున్నారు. నూతనంగా నియమితులైన జిల్లా పార్టీ అధ్యక్షుడు మారం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా పార్టీ అధ్యక్షునిగా నియమింప చేసినందుకు ఎమ్మెల్సీ కోదండరాంకు, రాష్ట్ర కార్యవర్గానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ నిర్మాణమే ధ్యేయంగా కృషి చేయడం జరుగుతుందని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అశోక్ రెడ్డి, మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, యువజన విభాగం రాష్ట్ర ఆర్గనైజన్ సెక్రెటరీ వీరన్న, యువజన విభాగం అధ్యక్షుడు రాజు ముదిరాజ్, వెంకటాచారి, లక్ష్మణ్, సూరం నరసింహులు, రవి, శ్రీనివాసరెడ్డి, సుమంత్ రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

# మోడల్ సోలార్ గ్రామంగా చెరువుమాధారం రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## ఉచిత విద్యుత్‌తో పాటు ప్రతి గృహంలో సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం

## 713 గృహజ్యోతి లబ్దిదారుల గృహాలకు 2 కిలోవాట్ల సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు

## రైతుల వ్యవసాయ మోటార్లకు సైతం సోలార్ విద్యుత్ అందించేలా పైలట్ ప్రాజెక్టు

## చెరువుమాధారంలో గృహాలకు 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్లను ప్రారంభించిన మంత్రి



**పోరు తెలంగాణ,ఖమ్మం జిల్లా బ్యూరో నాగకృష్ణ, ఆగస్టు-19:** జిల్లాలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడంతో పాటు, పేద కుటుంబాల విద్యుత్ అవసరాలను మరింత సమర్థవంతంగా తీర్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమంలో భాగంగా నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామాన్ని పైలట్ గ్రామంగా అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం చెరువుమాధారం గ్రామంలో గృహాలకు ఏర్పాటు చేసిన 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ వ్యవస్థను పరిశీలించి, లబ్ధిదారులతో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదింటి ఆడబిడ్డలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలన్న హామీ మేరకు గృహజ్యోతి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉచిత విద్యుత్ పథకంతో ప్రత్యేక అనుబంధం ఉందని, రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల సంక్షేమం, రైతుల సంక్షేమం, మహిళల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. చెరువుమాధారం గ్రామాన్ని మోడల్ సోలార్ గ్రామంగా ఎంపిక చేసి జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు క్రింద సోలార్ గ్రామంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రామంలోని అర్హత కలిగిన గృహాలకు 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో కుటుంబం సాధారణంగా నెలకు 140 నుంచి 150 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తే, సోలార్ వ్యవస్థ ద్వారా సుమారు 250 నుంచి 270 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. కుటుంబం వినియోగించిన తర్వాత మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి, నిబంధనల ప్రకారం మిగులు విద్యుత్‌కు సంబంధించిన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధంగా ఈ పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని వివరించారు. గృహాలకే పరిమితం కాకుండా రైతుల వ్యవసాయ మోటార్లకు కూడా సౌర విద్యుత్ అందించే దిశగా చెరువుమాధారాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశామని మంత్రి తెలిపారు. 10 హెచ్పి సామర్థ్యం కలిగిన వ్యవసాయ మోటార్లకు సోలార్ విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గృహాలకు సౌర విద్యుత్, రైతుల వ్యవసాయ మోటార్లకు సౌర విద్యుత్ అందించడం ద్వారా చెరువుమాధారం గ్రామాన్ని సమగ్ర మోడల్ సోలార్ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సోలార్ ప్రాజెక్టుకు దశలవారీగా భారీగా నిధులు వెచ్చిస్తున్నామని, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా గృహజ్యోతి పథకంతో పాటు రైతులకు కూడా సోలార్ విద్యుత్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. పేదల సంక్షేమం, రైతుల మేలు, మహిళల అభ్యున్నతి, యువత భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, చెరువుమాధారం గ్రామంలో మొత్తం 966 గృహజ్యోతి కనెక్షన్లు ఉన్నాయని, అందులో ప్రాథమికంగా 713 ఇళ్లను మోడల్ సోలార్ గ్రామం పథకం కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు అవసరమైన రూఫ్‌టాప్, స్లాబ్ వంటి నిర్మాణ సదుపాయాలను పరిశీలించి ఇళ్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. మిగిలిన ఇళ్లలో కూడా అవసరమైన ప్రత్యామ్నాయ నిర్మాణాలపై సాంకేతికంగా పరిశీలించి, సాధ్యమైన మేరకు అందరికీ సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఇంటికి ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్ ద్వారా సుమారు 250 నుంచి 270 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని, గృహజ్యోతి కింద సాధారణంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం ఉండే కుటుంబాలకు వినియోగం అనంతరం మిగిలే విద్యుత్ గ్రిడ్‌కు చేరేలా వ్యవస్థను రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు. లబ్ధిదారులు సోలార్ ప్యానెళ్లను సక్రమంగా నిర్వహించడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ సూచించారు. ప్యానెళ్లపై దుమ్ము, ధూళి పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, సూర్యరశ్మి సక్రమంగా పడేలా చూసుకోవాలని తెలిపారు. ప్యానెళ్లను శుభ్రం చేసేటప్పుడు కేవలం నీటిని ఉపయోగించాలని సూచించారు సోలార్ వ్యవస్థల నిర్వహణ, సాంకేతిక అంశాలపై లబ్ధిదారులకు సంబంధిత అధికారులు అవగాహన కల్పిస్తారని, గ్రామంలో అవసరమైన సాంకేతిక సహాయం అందించేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. సోలార్ కార్యక్రమం ద్వారా చెరువుమాధారం గ్రామం గ్రీన్ ఎనర్జీ వినియోగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం మంత్రి బుద్దారం గ్రామంలో రూ. 197 లక్షల వ్యయంతో బుద్దారం నుండి రాజారాంపేట వరకు, కొంగర గ్రామంలో రూ. 105 లక్షల వ్యయంతో కొంగర నుండి పాలేరు వాగు వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసా చారి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఇ యుగంధర్ రావు, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడివో ఎర్రయ్య, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ పర్యటనలో రాష్ట్ర మంత్రుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ లోకి ఓదెల సర్పంచ్ సతీష్





**పోరు తెలంగాణ సుల్తానాబాద్ ప్రతినిధి :** పెద్దపల్లి నియోజకవర్గం సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల చౌరస్తాతో పాటు మండలంలోని గర్రెపల్లి ,స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో కాల్వశ్రీరాంపూర్,ఎలిగేడు, జూలపల్లి మండలాల శిలాఫలకాలు రూ.219 కోట్ల 67 లక్షల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం), నాన్‌ప్లాన్ రహదారి అభివృద్ధి పనులకు , రాష్ట్ర గిడ్డంగుల శాఖ, సింగల్ విండో వారి అధ్వర్యంలో రూ. 32 కోట్ల నిధులతో నిర్మించబోయే నూతన గోదాంలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు , జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సహచర శాసనసభ్యులు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ప్రభుత్వవిప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు అనంతరం ఓదెల గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్ కనికి రెడ్డి సతీష్ మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తుమ్మల నాగేశ్వరరావు శ్రీధర్ బాబు ల సమక్షంలో ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా మంత్రులు సర్పంచ్ కు కండువా కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు.

# కోట మైసమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న నేతలు



**మహేశ్వరం, ఆగస్టు 19, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** కోట మైసమ్మ విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి, నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం పాతః కాల పూజ, దీక్ష హోమం, యంత్ర ప్రతిష్ట నిర్వహించారు. ప్రాణ ప్రతిష్ట, భింబకల వ్యాసము, గర్త పూజలు కలాన్యాసము, దిష్టి కుంభం బలి ప్రధానం, మహా పూర్ణాహుతిని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, ఉపసర్పంచ్ జోరల రమేష్, మాజీ ఎంపిటిసి సుదర్శన్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కరోల్ల చంద్రయ్య ముదిరాజ్, శ్రావణ్, పరమేష్ గ్రామ పెద్దలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జీవో నెం. 97ను వెంటనే రద్దు చేయాలి




**మహేశ్వరం, ఆగస్టు 19, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** జీవో నెం. 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మహేశ్వరం నగర కార్యదశి రాజేష్ తెలిపారు. 400 మంది పాలిటెక్నిక్ విద్యార్థులతో మహేశ్వరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాల నుండి ర్యాలీ మహేశ్వరం చౌరస్తా వరకు నిర్వహించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం జరగాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ భారీ ర్యాలీ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే జీవో నెం. 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.విద్యార్థుల సమస్య పరిష్కారం అయ్యే వరకు ఏబీవీపీ ప్రజాస్వామ్య పద్ధతిలో మరిన్ని ఉద్యమ కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని అన్నారు.ఈ క్రమంలో విద్యార్థుల నాయకులు అభిలాష్, చింటూ,ప్రాంతి,సాయికార్తిక్,రోహిత్, ఉదయ్ పాల్గొన్నారు.

# కోట మైసమ్మకు మహేందర్ ముదిరాజ్ 21 వేలు విరాళం



**మహేశ్వరం, ఆగస్టు 19, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మహేశ్వరంలో కోట మైసమ్మ విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమానికి తెలంగాణ ముదిరాజ్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గదగూటి మహేందర్ ముదిరాజ్ తన వంతు సహాయంగా 21 వేల రూపాయలను గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు గదగూటి జంగయ్య ముదిరాజ్, కరోల్ల రాములు, కరోల్ల చందు, కాకి రాజేష్, పరమేష్ పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట ప్రకారం పోటో గ్రాపర్ యూనియన్ కి ప్లాటు రిజిస్ట్రేషన్ చేయించిన కాటిపల్లి వెంకట రమణ రెడ్డి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19. (పోరు తెలంగాణ న్యూస్) :** కామారెడ్డి పట్టణ పోటో మరియు విడియో ల్యాబ్ సంక్షేమ సంఘం సభ్యులకి గతంలో కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి లి ఇచ్చిన మాట ప్రకారం సొంత ప్లాట్ రిజిస్ట్రేషన్ ఖర్చులతో సహా రిజిస్ట్రేషన్ చేయించి నేడు లిఅంతర్జాతీయ ఫోటోగ్రఫీ డే సందర్భంగా సంఘం సభ్యులకి రిజిస్ట్రేషన్ ప్రతులను అందజేసిన బీజేపీ నాయకులు. ఈ సందర్భంగా మెహెర్ బాబా కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ సమిష్టిగా సంఘం ఉండాలనే ఉద్దేశంతో గత కొన్ని సంవత్సరాలుగా అనేక కుల సంఘాలకు, యూనియన్ లకు తన స్వంత డబ్బులతో పనులు చేయించిన కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి గతంలో ఫోటోగ్రాఫర్,విడియో ల్యాబ్ సంక్షేమ సంఘం వారికి స్థలం రిజిస్ట్రేషన్ డబ్బులు కూడా తానే పెట్టుకొని చేయించారని, సమిష్టిగా అందరూ కలిసి అనేది ఆయన ఉద్దేశం అని భవిష్యత్తులో కూడా ఎలాంటి అవసరం ఉన్నా ఏ మ్మెల్యే యొక్కపూర్తి మద్దతు ఉంటుందని అన్నారు.